# ఓ చీకటి కోణం

వీరభద్ర పమ్మి



వెన్నెల చల్లగా వుంది. వెన్నెల అందంగా వుంది. వెన్నెల నేలమీద పుచ్చపువ్వులు పరిచినట్టు తెల్లగా ఉంది.

వెన్నెలను చూసిన సముద్రాలు ఆనందంతో పొంగుతున్నాయి. వెన్నెలను చూసి కుర్రకవులు పైజామాలు, లాల్చీలు ధరించి జుట్టును ఉంగరాలుగా తిప్పి భావావేశం తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నారు. వెన్నెలను చూసి అడవుల్లో పాములు తోకమీద నిలబడి బుసకొడుతున్నాయి.

కొత్త దంపతులు ఆరుబైట తెల్లటి పక్కలేసుకుని వెన్నెల్ని, మల్లెల్ని అనుభవిస్తున్నారు.

వెన్నెల లోకమంతా వెన్నెల

జానకి నిద్రపట్టక మంచం మీద అటూ ఇటూ కదిలింది. లేచి తలుపు తెరుచుకుని పెరట్లోకి వచ్చింది. వెన్నెల ఆమె ఒంటిని చుట్టేసుకుంది.

జానకి భయపడింది.

జానకి బాధపడింది.

జానకికి ఏడుపొచ్చింది.

చీకటి లేనందుకు ఆమె విసుక్కుంది.

చీకటంటే తన కెంత ప్రాణమని?....

తనలాంటి చీకటి, తన బతుకులాంటి చీకటి చీకటి ఆమెను ఓదారుస్తుంది. చీకటి ఆమెకు ధైర్యం చెప్తుంది. చీకటి ఆమెను కన్నతల్లిలా కౌగలించుకుంటుంది.

కాని కాని . ఎక్కడ చూసినా వెన్నెల

"ఛీ పాడు వెన్నెల!"

గదిలో కెళ్ళి తలుపులు మూసేశాక

గదంతా చీకటి నిండిపోయాక....

జానకి నిద్రపోయింది.

• • •

బంగారు కనస్ట్రక్షన్స్‌కి అప్పలరాజు యజమాని. ఆ కంపెనీ పేరుతో ఆయన కాంట్రాక్టులు చేస్తారు. మొదట్లో చిన్న చిన్న రోడ్డు రిపేర్లుగా మొదలైన ఆయన వ్యాపారం పెద్ద పెద్ద ఆసుపత్రులు, కాలేజీలు, వంతెనలు కట్టేస్థితికి ఎదిగింది.

కాంట్రాక్టులు చేస్తున్నా అప్పలరాజు గారు మంచివాడనే పేరుంది. అవసరంలో ఉన్నవారికి సాయంచేస్తాడని ఆయన దగ్గర పనిచేసేవాళ్ళకి ఆయనంటే ఇష్టం వుంది.

ఆయనకి అరండ్‌బి డిపార్టుమెంటులోనే కాక, సెక్రటేరియట్‌లో కూడా మంచి పలుకుబడి వుందని ఆయనంటే ఇష్టంవున్నవాళ్ళు చెప్తారు.

కాని సెక్రటేరియట్‌లో వాళ్ళకి, అరండ్‌బి డిపార్టుమెంటు వాళ్ళకీ ఆయనంటే ఇష్టంవున్నట్లు ఎవ్వరికీ తెలియని రహస్యం ఉంది.

బంగారు కనస్ట్రక్షన్‌కి అప్పలరాజు యజమాని. కాని అప్పలరాజుకి మాత్రం ఆయన భార్య బంగారమ్మ యజమానురాలు.

బంగారమ్మ ఒంటినిండా బంగారంతో కాపురానికి వచ్చింది. మధ్యతరగతిలో మామూలుగా బతుకుతున్న అప్పలరాజు బంగారమ్మ రాకతో కొత్త పైతరగతిలోకి జరిగాడు.

బంగారంతో వచ్చిన తన జీవితాన్ని, క్లాసుని, భవిష్యత్తుని మార్చేసిన బంగారమ్మంటే అప్పలరాజుకి కొంత ప్రేమ, అభిమానమే కాకుండా మరి కొంత భయం, భక్తి కూడా ఉన్నాయి. ఆయన వ్యాపారానికి, అంతస్తుకి, చివరికాయన జీవితానికి కూడా ... ఆవిడే పెట్టుబడి, ఆలంబన.

అప్పలరాజు అయిదేళ్ళ సంపాదనతో పదెకరాల పొలం కొందామని ఆవిడ అన్నప్పుడు, ఆయనేం అనలేదు. పది ఎకరాలు కొని దస్తావేజులు పట్టుకొచ్చి చూపించాడు.

పట్నంలో కాపురం పెట్టుకుంటే పిల్లలకి మంచి చదువు, తనకి మంచి సినిమాలు దగ్గర్లో వుంటాయని ఆవిడ అన్నప్పుడు పట్నంలో ఇల్లుకొని వారం తిరక్కుండా కాపురం పెట్టాడు.

లోకం తన గురించి ఏ రకంగా అనుకున్నా పెళ్ళాం మాట విని.... తను 'శాంతి' కొనుక్కుంటున్నట్టుగా భావించాడే తప్ప పెళ్ళాన్ని పల్లెత్తు మాటనలేదు.

కాని.... జానకి విషయంలో మాత్రం అప్పలరాజు బంగారమ్మ మనసు శాంతి కొనుక్కోలేకపోయాడు. ఎన్ని రకాలుగా చెప్పినా, నచ్చచెప్పడానికి ప్రయత్నించినా, బతిమాలినా.... లాభం లేకపోయింది....

అన్ని విషయాల్లోను పెళ్ళాం మాట విని తానే గెలిచినట్టుగా తృప్తిపడే

అప్పలరాజు జానకి చదువు విషయంలో మాత్రం జీవితంలో మొట్టమొదటి సారిగా పెళ్లాంచేతిలో ఓడిపోయినట్టు ఫీలయ్యాడు.

అలాంటి పరిస్థితి కల్పించిన జానకి మీద ఆయనకు కోపం లేదు. జానకి భవిష్యత్తు తల్చుకుని ఆయన భయ పడ్డాడు.

• • •

అప్పలరాజుకి ఓ మేనమామ ఉండే వాడు. ఆ మేనమామకి సుభద్రనే కూతురుండేది. మేనమామ కూతుర్ని చేసుకుందామని అప్పలరాజు ఆయన తల్లి చాలా సరదాపడ్డారు. కాని ఆయన మేనమామ మాత్రం అలాంటి సరదా పడలేదు. ఆయన ప్రతి మనిషిని "ఇన్ని ఎకరాల వాడుగానో- అన్ని లక్షల వాడుగానో" మాత్రమే గుర్తించేవాడు. అప్పలరాజు ఆయన గుర్తింపుకి బొత్తిగా ఆనలేదు. అయిదెకరాలు, అయిదువేలు కట్నంగా తీసికెళ్ళే తన కూతురికి "అప్పలరాజుగాడు" మొగుడిగా పనికి రాడని ఆయన కొట్టిపారేశాడు.

తన కూతుర్ని, అయిదెకరాల్ని, అయిదు వేలని తీసికెళ్ళి ఓ "పదెకరాల వాడికి" కట్టబెట్టాడు. పదెకరాల వాడు ఆడాళ్ళ విషయంలో అపర శ్రీకృష్ణుడని, జూదంలో అపర ధర్మరాజని, తాగుళ్ళో అతని కెవరూ సరిపోరని తర్వాత తెల్సింది.

అతను తన పదెకరాలు, పెళ్ళాం అయిదెకరాలు కూడా పేకాడేసి, ముండల కెట్టేసి.. తాగి ... తాగి.... తాగుతూ చచ్చిపోయాడు...చచ్చేటప్పటికి అతనికో కూతురుంది. ఆ అమ్మాయిపేరు జానకి.

సుభద్రని తనకిచ్చి చెయ్యనందుకు, మేనమామమీద కోపం పెంచుకోగలిగిన అప్పలరాజు.... సుభద్రమీద తను పెంచుకున్న ఇష్టాన్ని చంపుకోలేక పోయాడు.

అప్పుడప్పుడు పెళ్లానికి తెలియకుండా వెళ్ళి సుభద్రని, పిల్లని చూసి వస్తూండే వాడు. ఆర్థికంగా కాస్త సాయం చేసే వాడు. జీవితంలో అన్నీ పోగొట్టు కున్న సుభద్రంటే అప్పలరాజుకి . సానుభూతి, జాలి, దయ .. చిన్నప్పుడు పెంచుకున్న ఇష్టం.

దరిద్రంతో రోగంతో, బెంగతో బాధపడి సుభద్ర కన్ను మూస్తే ... ఆవిడ కూతురు జానకిని దిక్కులేని దానిలా వదిలెయ్యలేకపోయాడు అప్పల రాజు. వదిలెయ్యనని సుభద్రకి ఆమె బతికుండగా మాట ఇచ్చాడు.

జానకిని ఇంట్లో పెట్టుకోడానికి పెళ్ళాం నసేమిరా ఒప్పుకోదని భయపడిన అప్పలరాజుకి "పోనీ తీసుకురండి, ఇంట్లో పడుంటుంది." అన్న బంగారమ్మ మాటలు.... ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించాయి.

కాని.... జానకిని ఇంటో పెట్టు

కోడంలో ఇద్దరి ఉద్దేశ్యాలు వేరు. అవి ఒకరికొకరు చెప్పుకోలేదు. ఎవరి మన సులో వాళ్ళు దాచుకున్నారు.

సమయం వచ్చినప్పుడు చెప్పవచ్చని అప్పలరాజు అనుకున్నాడు. బంగా రమ్మకి మాత్రం సమయం కోసం ఎదురుచూడాల్సిన పనిలేదు. ఏ విషయ మైనా, ఏ సమయంలోనైనాసరే మొగుడికి కుండ బద్దలుకొట్టినట్టుగా ఆవిడ చెప్ప గలదు. కాని సందర్భం రాలేదు కాబట్టి ఆవిడ ఉద్దేశ్యం చెప్పలేదు.

సమయం సందర్భం ఒకేసారి వచ్చాయి.

జానకి కూడా వాళ్ళమ్మాయి సుశీల వయసుదే. జానకి కూడా పదోక్లాసు పాసయ్యింది. కాబట్టి సుశీలతోపాటు జానకికూడా ఇంటర్మీడియట్లో చేరిస్తే.. మెల్లగా ఆమె ఏ బి.యస్సీనో చదువు కుంటే, ఓ చిన్న ఉద్యోగస్తుడికిచ్చి పెళ్ళి చేస్తే ... ఇద్దరూ ఉద్యోగం చేసుకుంటూ బతుకుతారన్నది ఆయన ఉద్దేశ్యం..

జానకి కూడా వాళ్ళమ్మాయి సుశీల వయసుదే కాని ఆ అమ్మాయికి సుశీల లాకాకుండా కాస్త పని (పాట) వచ్చు. సుశీల ఎలాగూ కాలేజీ వెళుతుంది కాబట్టి- జానకి ఇంట్లోపని, వంటపని చూసుకుంటూ తనకి చేదోడువాదోడుగా ఉంటుంది. తర్వాతెప్పుడో ఎవడికో ఒకడికి ఇచ్చి చేస్తే- వాడు తమ పొలాలు చూస్తూ ఉంటాడు. జానకి తనకి కుడిభుజంలా కాకపోయినా కనీసం ఎడంభుజంలా నైనా పడుంటుంది- ఇది బంగారమ్మ అభి ప్రాయం.

ఇద్దరి అభిప్రాయాలు ఒకరు సూచన ప్రాయంగాను, మరొకరు ఖచ్చితంగాను చెప్పేసుకున్నారు. ఇద్దరి అభిప్రాయాలు ముక్కోదురుగా ఉన్నాయి.

అప్పలరాజే కొస్త పట్టు సడలించాడు. జానకి చదువుకుంటూ, ఇంటిపని, వంట పని చెయ్యడంలో బంగారమ్మకి సాయం చేస్తుందని చిన్న సవరణ చేసాడు.

బంగారమ్మకి రాజ్యాంగం నుంచి అభిప్రాయాలవరకు దేనికి సవరణ చెయ్యడంలో నమ్మకంలేదు. అంచేత వంటపని, ఇంటిపని చేస్తూ జానకి చదువు కోడానికి ఆమె ఇష్టపడలేదు.

మూడ్రోజుల తర్వాత అప్పలరాజు ఓటమి నంగీకరించాడు. ("ఆయన మొహం, ఆయన మొదటిరోజునే ఓడి పోయాడు" అంటుంది బంగారమ్మ నడిగితే )

మరీ మంకుపట్టు పడితే అసలు జానకిని ఇంట్లోనే వుండనివ్వనంటుం దేమో అనుకున్నాడు అప్పలరాజు ఆయన కళ్ళముందు సుభద్ర మెదిలింది. "నీకు తెలియని దేముంది సుభద్ర?" అనుకు న్నాడు అన్యాపదేశంగా.

బంగారమ్మ కళ్ళముందు సుభద్ర కద లేదు మెదల్లేదు. ఎక్కడో తన మొగుడి "మేనమామ కూతురిమీద" కాని "దాని

కూతురిమీద" కావి బంగారమ్మకు ప్రేమ, అభిమానము ఏవీ లేవు. అల్లాగని జానకి మీద అయిష్టం కాని, అసహ్యం కానిలేవు. మంచి మనిషి, వంటమనిషి దొరకని రోజుల్లో సన్మూకంగా ఇంట్లో పడిఉండే "పిల్ల" దొరికినందుకు మాత్రం ఆవిడ కాస్తంత ఆనందించింది.

చదూకోడం కుదరనందుకు జానకి కాస్త బాధపడేదే తప్ప ఆ బాధని మనసులో పెట్టుకోలేదు ఆమె తెలివైంది. తండ్రిచేతుల్లో తల్లిపడ్డ కష్టాలు చూసింది. కష్టాలామెకు జీవితం ఏమిటో చెప్పాయి. చిన్నప్పుడే వేదాంతంలాంటిది తెలియకుండానే అబ్బింది. ఆమె జీవితాన్ని చదివింది. వాళ్ళింటికి దగ్గర్లో వున్న లైబ్రరీలో జీవితాన్ని గురించి మంచి మంచి పుస్తకాలు చదివింది.

ఇంత కూడు, ఆ వయసుకి కావల్సిన ఇంత నీడ దొరికినందుకు ఆమె సంతోషపడింది. అవి ఏర్పరిచినందుకు అప్పలరాజు బాబయ్యకి, బంగారం (లాంటి) పిన్నికి మనస్సులోనే దణ్ణం పెట్టుకుంది.

సుశీల సకాలజ్ఞమని కాలేజీకి వెళ్ళడం మొదలెట్టగానే జానకి గరిటె పట్టుకుని వంటింట్లోకి, ఎంగిలి గిన్నెలు పట్టుకుని పెరట్లోకి వెళ్ళడం మొదలెట్టింది.

పొద్దున్నే సుశీలను లేపి కాఫీ ఇవ్వడంతో మొదలైన ఆమె దినచర్య, బంగారం పిన్నికి కాళ్ళు వత్తడంతో రాత్రి పదకొండుగంటలకి పూర్తవుతుంది.

ఏరోజైనా సుశీలకాని, ఆమె తమ్ముళ్ళు కాని, బంగారమ్మ కాని.... ఏ సమయంలోనైనా ఏ కారణంగానైనా జానకి మీద విసుక్కోవచ్చు. చిరాకు పడొచ్చు. తిట్టొచ్చు. కొన్ని రోజులు పొద్దుట్నుంచి సాయంత్రంవరకు ఇవన్నీ లభించవచ్చు.

తనూ సుశీల వయసుదే కాబట్టి సుశీలలా తననూ అబ్బురంగా చూడాలని జానకి ఆశించలేదు 'సుశీలెక్కడ? నేనెక్కడ?' అనుకుంటుంది. కాని ఒక్కసారి బంగారమ్మ తిట్టే తిట్లు మనసుని కల్లోలపరిచి ఎవరూ చూడకుండా కన్నీళ్ళు తెప్పిస్తాయి

అలాంటప్పుడు జానకి అప్పలరాజు బాబాయిని తల్చుకుంటుంది "ఆయనే ఆవిడ తిట్లు పడుతున్నప్పుడు నేనెంత?" అనుకుంటుంది.

ఆ ఇంట్లో జానకికి చేతినిండా పని ఉంది. కడుపునిండా తిండి ఉంది. కట్టుకోడానికి గుడ్డ, ఉండటానికి గూడు ఉన్నాయి.

కాని. ఎవరి ఆప్యాయత, సానుభూతి లేదు. అఖరికి మానేస్తుందన్న భయంతో జీతానికి పనిచేసే పనిమనిషిగానైనా కాస్త బాగా చూస్తారేమో

ఆమెను నవ్వుతూ, ఆప్యాయతతో పలకరించే మనిషి అప్పలరాజు బాబయ్య ఒక్కడే.

ఆయన శ్రీకాకుళం జిల్లాలో ఏవో కాంట్రాక్టులు చేస్తున్నందువల్ల ఎక్కు

వగా అక్కడే ఉంటున్నాడు.

కాబట్టి జానకి ఇప్పుడా మంచి పలుక రింపుకూడా నోచుకోలేదు.

ఆమె మంచి పలుకిస్తే, నిండు పలక రింపుకి ప్రతిస్పందిస్తున్నప్పుడు

అవును సరిగా అప్పుడే

రాంబాబు వాళ్ళింట్లో ప్రవేశించాడు.

రాంబాబు బంగారమ్మకి అన్నకొడుకు. డబ్బున్న కుటుంబంలో పుట్టి, పెరిగి నందువల్ల- అతనికి చదువు సరిగా అబ్బ లేదు. ఇరవైనాల్గో ఏట అతి కష్టంమీద ఇంటర్మీడియట్ పూర్తిచేసాడు

సినిమాలు, షికార్లువల్ల కొడుకు పాడై పోతున్నాడని అతని తండ్రి రాంబాబుని మేనత్తగారింట ఉండి చదువుకొమ్మని పంపాడు. అతనక్కడ బిఏలో చేరాడు.

రాంబాబు డబ్బువల్ల హుషారుగాను, వయసువల్ల దర్జాగాను, సహజంగా అందంగాను వుంటాడు. బంగారమ్మకి అతనంటే వల్లమాలిన అభిమానం, అప్యా యత ఇంట్లో అందరూ అతన్ని వెరీ ఇంపార్టెంట్ పర్సన్‌లా, ఇంగ్లండ్‌లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌లా చూస్తారు అతని మాటను అందరూ శిరసావహిస్తారు

రాంబాబు ఆ ఇంటికొచ్చిన కొత్తలో జానకికి అతనిమీద ఎలాంటి అభిప్రాయం కలగలేదు. అతనికోసం చెయ్యాల్సిన పనుల్లో మరింత జాగ్రత్తగా ఉండాలన్న అభిప్రాయానికి మాత్రం వచ్చింది.

కాని అతనొచ్చిన కొద్దిరోజులకే .. అవును చాలా కొద్ది రోజులకే... ఓ రోజు

తనకి అన్నం పెట్టడం లేటయ్యిందని సుశీల జానకిని కసురుకుంది. చెప్పులు కొట్టడానికి రెండుచేతులు అక్కర్లేదని ఆవేళ ఋజువైంది జానకి మాట్లాడ కుండా అవమానాన్ని, బాధని, ఏడుపుని దిగమింగుకుంటూ స్థాణువులా నిలబడి పోయింది. సుశీల విసుక్కుంటూనే ఉంది. తిడుతూనే ఉంది.

అప్పుడే అక్కడికొచ్చిన రాంబాబు పరిస్థితి గమనించాడు సుశీల తప్పు ఎత్తి చూపించి, ఆమెను వారించడానికి ప్రయత్నించాడు

సుశీల అతనిమీద గయ్యమని ఇంతెత్తు లేచింది.


అంతే బస్

జానకిలా అందరూ నోరుమూసుకుని పడి ఉండరని రాంబాబు నిరూపించాడు.

ప్రతి చిన్న విషయానికి ఒంటికాలు మీద లేచే సుశీల ఆ రోజు నేలమీద కూర్చోవల్సి వచ్చింది. బావని ఎదిరించి నందుకు ఆమెను తల్లి కూడా తిట్టింది.

ఆ సాయంత్రం రాంబాబు దగ్గరికెళ్ళి "సారీ బావా!" అంటే- "నాక్కాదు జానకికి చెప్పు." అన్నాడు

సుశీల వంగి, ఇష్టంగానో, అయిష్టం గానో తనకి సారీ చెప్తే జానకి పొంగి పోలేదు కొండ శిఖరంగా కూర్చు న్నట్టు ఫీలవలేదు పాతాళంలోకి తొక్కి-




వెయ్యబడ్డ మనిషి, భూమ్మీదకొచ్చి రెండుకాళ్ళమీద గౌరవంగా నిలబడ గలిగిన భావన మాత్రం కలిగింది. అలా నిలబెట్టిన రాంబాబుమీద కృతజ్ఞతా భావం కలిగింది.

మరో రోజు.. తన పుట్టినరోజు నాడు సినిమాకి రమ్మని సుశీల రాంబాబు నడిగితే....

"జానకిక్కి పనిలో సాయం చెయ్యి. ఇద్దరూ కల్సి త్వరగా పని తెముల్చు కుంటే అందరం కల్సి ఫస్టుషో కెడదాం." అన్నాడు.

ఆవేళ జానకి కూడా వాళ్ళతో సినిమా కెళ్ళింది.

ఇలాంటి చిన్న చిన్న సంఘటనలు ఎన్నో జరిగాయి జానకి ఆనందానికి హద్దు లేదు.

"ఈ లోకంలో మా నాన్నలాంటి వాళ్ళు, బంగారంపిన్ని లాంటివాళ్ళు, సుశీలలాంటి వాళ్ళు మాత్రే ఉన్నారను కున్నాను. అప్పలరాజు బాబయ్యల్ని, రాంబాబుల్ని కూడా సృష్టించిన నువ్వే గొప్ప చతురుడవయ్యా!" అనుకుంది దేవుణ్ని తల్చుకుని.

"నా మీద నీ కెంత దయ!" అని రాంబాబుతో అంటే,

మొదట్లో నవ్వి ఊరుకున్నాడు.

తర్వాత "అది దయకాదు పిచ్చిదానా-....అది ప్రేమ." అన్నాడు.

"నాది ఒట్టి ప్రేమ కాదు- నిన్ను పెళ్ళిచేసుకుంటాను." అన్నాడు ఓ

వెన్నెల రాత్రి.... అవును ఆవేళ లోకమంతా వెన్నెల...

అతనలా అన్నపుడు జానకికి నయాగరా జలపాతాన్ని చూస్తున్నంత భయం, చిన్న పాపాయిని చూస్తున్నంత ఆనందం, చల్లటి నీళ్ళలో తలారా స్నానం చేస్తున్నంత థ్రిల్... అన్నీ కలిగాయి...

కష్టాల్లో పుట్టి, కష్టాల్లో పెరిగి, కష్టాల్లో బతుకుతున్న తనకిక కష్టాలుండవ్ అనుకుంది. తన జీవితం ఇలాంటి మలుపు తిరుగుతుందని ఆమె ఊహించలేదు. తిరిగినప్పుడు ఆమెకు ఆశ్చర్యం కలిగింది. భయం కలిగింది.

జానకమ్మ డిటెక్టివ్ కాదు. సి.ఐ.డి. ఆఫీసరూ కాదు.... కాని వంటింట్లోనో, పెరట్లోనో పనిచేయాల్సిన పిల్ల.... అన్నీ తెలుసుకుని తనివితీర్చి రాంబాబు లోకంలో తిరగడానికోసం.... ఇది గ్రహించడానికి ఆమె కెన్నాళ్ళ కాలం పట్టలేదు.

గ్రహించాక చేయిదాటి పోనివ్వదం....? అసలావిడ ఏ విషయాన్నీ చేయి దాటి పోనివ్వదు.

జానకి భయం నిజమైంది.

రాంబాబు జీవితం సుఖంకోసం వడ్డించిన విస్తరి... కాదు కాదు.... వెండి కంచం, ఆ వెండికంచం దగ్గర.... తన కూతురికోసం వడ్డించిన వెండి కంచం దగ్గర మరో పిల్ల.... వెధవ వంట వార్పు చేసుకుని బతకాల్సిన పిల్ల కూర్చోవాలనుకోదం...

ఆవిడ సహించలేకపోయింది. ఆవిడలోని తల్లి సహించలేకపోయింది. ఆవిడకున్న తెలివి, అహం, మేధస్సు, పథకం వెయ్యగల మెదడు.... ఏవీ సహించలేకపోయాయి.

ఆవిడ ఏం చెయ్యాలో ఆలోచించింది.

ఒకే ఒక్క నిముషం ఆలోచించింది.

వారం తిరక్కుండా...

ఆవిడ అన్నగారు రావడం, రాంబాబు చదువు మరో పట్నానికి మారిపోడం జరిగిపోయింది.

జానకి బాధపడింది. రాంబాబుని మర్చిపోయి మళ్ళీ వంట, పెట్టు, పాడి, పని.... వీటిల్లో మునిగిపోదామనుకుంది. కాని రాంబాబు వెడుతూ "ఎప్పటికైనా నిన్ను చేసుకుంటాను." అని చెప్పి వెళ్ళాడు.

వెళ్ళినవాడు మళ్ళీ రాలేదు. రోజూ జ్ఞాపకం వస్తున్నాడు. వచ్చి మనసుని బాధిస్తున్నాడు.

అయినా.... జానకికి ఏదో ఆశ.... ....ఎప్పటికైనా వస్తాడని, తనని తీసికెడతాడని,... మిణుకు మిణుకు మంటూ ఉంటుంది.

రాంబాబు రాలేదు కాని కొన్నాళ్ళ తర్వాత అతని ఉత్తరం వచ్చింది.

"నిన్నే చేసుకోవాలని మొన్న మొన్నటిదాకా అనుకున్నాను. నాన్నతో

వాదించాను.... కాని నాన్న ఓ విషయం చెప్పారు. అదే విషయం మళ్ళీ మళ్ళీ చెప్పారు

నిన్ను చేసుకుంటే ఆస్థిలో పైసా కూడా ఇవ్వనన్నారు. నా చదువా అంతంతమాత్రం

ఆ చదువుకో ఉద్యోగం రాదు. నాకు నేనే సమస్య నౌతాను నిన్ను చేసుకుని నీకు కనీసం తిండైనా పెట్టలేని పరిస్థితి .. ఆ పరిస్థితిని నే నూహించలేను. ప్రేమ మనిషిని సుఖపెట్టాలి .. అంతేకాదు. సుశీల స్థానాన్ని నువ్వాక్రమించావన్న కోపంతో అత్తయ్య నిన్ను బైటకు పొమ్మంటుంది. నాన్న నన్నూ అంతే!

అదే నేను సుశీలను చేసుకున్నా ననుకో.. అహఁ.. అనుకో. నిన్ను కనీసం ఏ కాయకష్టం చేసుకునేవాడికో చేస్తుంది అత్తయ్య. అతను నీకు కనీసం కడుపునిండా అన్నం పెట్టగలిగే స్థితిలో ఉంటాడు.

ఏ రకంగా ఆలోచించినా మనిద్దరం పెళ్ళి చేసుకోకపోవటం మూలాన . ఇద్దరికీ కష్టాలు తప్పుతాయి. ఇది మోసం కాదు.. మారిన పరిస్థితులకి అనుగుణంగా మన ఆలోచన కూడా మారాలి అదే ఇది!"

ఈ ఉత్తరం చదివిన జానకి ఏడవ లేదు. ఆమెకి ఏడుపు రాలేదు.

తర్వాత కాలము, సంఘటనలు త్వరగా కదిలాయి.



జానకి కోరుకుందే అదే ఇదో సుశీల పెళ్ళి, రాంబాబుతో కుదిరింది. తాంబూలాలు పుచ్చుకున్నారు.

జానకి ఏడవలేదు. ఆమెకి ఏడుపు రాలేదు. సుశీల పెళ్ళి ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరిగాయి. జానకి పనులన్నీ చకచక చేసింది.

జానకి ఏడవలేదు. ఆమెకి ఏడుపు రాలేదు.

ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగువేసి సుశీల పెళ్ళి చేసారు. రంగు

రంగుల లైట్లు పెట్టారు. సన్నాయి పెట్టారు. బాండ్ కొట్టారు. బాణసంచా కాల్చారు.

భూమి, ఆకాశం ఏకం అయినట్టుగా దద్దరిల్లకొట్టారు. జానకి చూస్తుండగానే రాంబాబు సుశీల నెత్తిమీద జీలకర్ర, బెల్లం పెట్టాడు. సుశీల మెళ్ళో మంగళ సూత్రం కట్టాడు.

అయినా సరే జానకి ఏడువలేదు. ఆమె కన్న ఏడుపు రాలేదు.

కాని కాని

ఆ రాత్రి నూతన దంపతులు ఇద్దరూ కలిసి ఒకే వెండికంచంలో పరమాన్నం తిన్నాక వాళ్ళిద్దర్నీ గదిలోకి పంపించి వచ్చిన బంగారమ్మ జానకిని పిల్చి ఎంతో ఆప్యాయంగా

"చూడమ్మా జానకీ. ఆ కంచం అలాగే ఉండిపోయింది. అసలే వెండిది. ఈ హడావుడిలో ఎవరేనా కొట్టేస్తారు. కాస్త కడిగి బీరువాలో పెట్టెయ్యి" అంది.

ఆ కంచం తీసుకుని పెరట్లోకి వెళ్ళిన జానకి నూతన దంపతులు కలిసి తిన్న కంచాన్ని చూసి ఆ ఎంగిలి కడగాల్సి వచ్చిన తన పరిస్థితి చూసి పైగా పుచ్చపువ్వులా ఉన్న వెన్నెల్ని చూసి

ఏడుపు ఆపుకోలేకపోయింది. దుఃఖాన్ని మింగలేకపోయింది.

నూతి అంచు పట్టుకుని వెక్కి వెక్కి గుండెలవిసిపోయేట్లు, స్పృహ తప్పిపోయేలా ఏడ్చింది

ఆ సమయంలో ఆమెకు వెన్నెల మనసున్న మనిషిలా బాధగాను, మనసు లేని మనిషిలా క్రూరంగాను, రోషిష్ఠి మనిషిలా అసహ్యంగాను కనిపించింది.

ఆనాటి నుంచి జానకికి వెన్నెల ఏడుస్తున్నట్టే కనిపిస్తుంది.

